క్లుప్తంగా

క్రమం తప్పకుండా తనిఖీలు



అంగన్‌వాడీ కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

రేగిడి: గర్భిణులు, చిన్నారులు, బాలింతలు ప్రతీ నెల క్రమం తప్పకుండా ఆరోగ్య తనిఖీలు నిర్వహించుకోవాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అసిరినాయుడు సూచించారు. మండలంలోని చాటాయివలస, ఉప్పర్నాయుడువలస, వండానపేట తదితర అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్య శిబిరాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, చిన్నారులకు అవసరమైన మందులు అందజేశారు. అంగన్‌వాడీలు ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు.

విజేతలకు బహుమతులు



వన్నలిలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న సర్పంచ్ రమణ

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా గ్రామానికి చెందిన యువత విద్యార్థులకు, మహిళలకు పలు రకాల పోటీలు నిర్వహించారు. సైకిలింగ్‌తో పాటు ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు సర్పంచ్ గార రమణ చేతుల మీదుగా బహుమతులు అందించారు. బెవర నరేష్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి.

గ్రామాల్లోనే 'ఉపాధి'



నాయిరాలవలసలో వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీఓ హరనాథరావు

రేగిడి: ప్రతీ గ్రామంలో ప్రభుత్వం ఉపాధి పనులు కల్పిస్తుందని వేతనదారులు విధిగా ఉపాధి పనులు చేసుకోవాలని ఏపీఓ ఎస్.హరనాథరావు సూచించారు. మండలంలోని నాయిరాలవలస, వెంకమ్మపేట తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు సూచించిన విధంగా పనులు చేయించుకోవాలని తెలిపారు.

పేదలకు దుస్తుల పంపిణీ



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

రాజాం: మండలంలోని కొత్తవలస గ్రామంలో జీఎంఆర్ వీఎఫ్ ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు బుధవారం పంపిణీ చేశారు. ఫౌండేషన్ జనరల్ మేనేజర్ కె.జయకుమార్, అసోసియేట్ మేనేజర్ వై.సాయికిశోర్, జీఎంఆర్‌వీఎఫ్ ప్రతినిధి లావేటి రాజుల ఆధ్వర్యంలో వీటిని పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం కుదమ తిరుమలరావు చేతులు మీదుగా వీటిని అందించారు. కార్యక్రమంలో జీఎంఆర్ వీఎఫ్ వలంటీర్లు జి.వెంకటరమణ, జి.శారదకుమార్, టి.రమేష్, మొయిల విజయలక్ష్మి, కొయ్యాన రమ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం



నిర్మాణాలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ

తెర్లాం: జగనన్న ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని జగనన్న ఇళ్ల లేఅవుట్‌లో జరుగుతున్న నిర్మాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉగాది రోజున నిర్వహించనున్న సామూహిక గృహప్రవేశాలకు లబ్ధిదారులు సిద్ధంగా ఉండాలని తెలిపారు. వందకు పైగా ఇళ్ల నిర్మాణాలు జరుగుతుండడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. లే అవుట్‌లో ఇప్పటికే తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించామని.. మిగిలిన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సంతోషిమాత ఆలయంలో పూజలు

సంతకవిటి: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో సంతోషిమాత ఆలయ 37వ యాత్రా మహోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మామిడిపల్లితో పాటు పరిసర గ్రామాల భక్తులు పూజల్లో పాల్గొన్నారు.



రాజాం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ప్రయాణికుల రద్దీ



బస్సు ఎక్కేందుకు ప్రయాణికుల పాట్లు

తిరుగు ప్రయాణాలతో బస్సుల కిటకిట

రాజాం: సంక్రాంతి పండుగ తరువాత సొంతూళ్లకు వచ్చిన వారు పని ప్రదేశాలకు తిరుగు పయనం కావడంతో ఆర్టీసీ సర్వీసులు కిటకిటలాడుతున్నాయి. విశాఖపట్నం, విజయవాడ తదితర ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ సర్వీసులు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. కాంప్లెక్స్ ప్రయాణికులతో సందడిగా మారింది. మరో నాలుగైదు రోజులు ఈ రద్దీ ఉండే అవకాశం ఉంది.

13 కేంద్రాలలో పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్ష



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మోహనరావు

బొబ్బిలి: ఈ నెల 22న జరగనున్న పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ పరీక్షకు బొబ్బిలి పట్టణంలో 9 కేంద్రాలు, మండలంలో నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ, పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష నోడల్ అధికారి మోహనరావు తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ, 13 కేంద్రాలలో 4,228 మంది అభ్యర్థులు పరీక్ష రాయడానికి అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామన్నారు. పరీక్ష ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకు జరుగుతుందని, అభ్యర్థులంతా గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్ష కో ఆర్డినేటర్, పార్వతీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ చలపతిరావు మాట్లాడుతూ, అభ్యర్థులు హాల్‌టికెట్, బాల్‌పాయింట్ పెన్నుతో పాటు ఆధార్ లేదా ఏదైనా ఐడీ ప్రూఫ్ తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రహదారి భద్రతా వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



రోడ్డు భద్రతా వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ తదితరులు

రాజాం: పట్టణంలోని సూర్యదుర్గా కల్యాణ మండపం వద్ద రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ, కలెక్టర్ ఎ.సూర్యకుమారి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేతుల మీదుగా రోడ్డు రవాణా శాఖ రహదారి భద్రతా వారోత్సవాల పోస్టర్లను బుధవారం ఆవిష్కరించింది. పెద్దపెద్ద బ్యానర్లతో పాటు స్వచ్ఛతా పక్వాడ – 2023 పేరుతో ఉన్న పోస్టర్లను ఆవిష్కరించి అక్కడున్న వారికి అవగాహన కల్పించారు. ఈ నెల 24వరకూ ఈ వారోత్సవాలు ఉంటాయని, అన్ని ప్రాంతాల్లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నామని రోడ్డు రవాణా శాఖ డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ డాక్టర్ వి.సుందర్ వెల్లడించారు. కార్యక్రమంలో ఎంవీఐలు ఏవీ రమణ, ఎస్.రమేష్, వి.దుర్గాప్రసాద్, అసిస్టెంట్ ఎంవీఐ వి.శ్రావ్య, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేడాడ తిలక్, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళులు



బొబ్బిలి రూరల్: పక్కిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి రూరల్: దివంగత ఎన్టీఆర్ మహానాయకుడని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని పక్కి గ్రామంలో ఎన్టీఆర్ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలుగువారి ఖ్యాతి దశదిశలా వ్యాపించిన నాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, సర్పంచ్ గంట పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు. మెట్టవలసలో సర్పంచ్ పువ్వల మాధవరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కెల్ల తవుడు, తదితరులు పాల్గొన్నారు.

గజరాయునివలసలో...

బాడంగి: మండలంలోని గజరాయునివలసలో ఎన్టీఆర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. రామమందిరం వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పాలవలస గౌరు, సర్పంచ్ మూడడ్ల సత్తిబాబు, కామినాయుడు, సత్యం, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తులసీరావు సేవలు మరువలేం..

రామభద్రపురం: విశాఖ డెయిరీ చైర్మన్ దివంగత ఆడారి తులసీరావుకు వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం స్థానిక పాలసొసైటీ -1లో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు చొక్కాపు రామకృష్ణ మాట్లాడుతూ, పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా తులసీరావు సేవలందించారన్నారు. ఆయన మరణం పాడిరైతులకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో సొసైటీ సూపర్‌వైజర్ వెంకటరావు, కార్యదర్శి చొక్కాపు లక్ష్మణ, సిబ్బంది ఎర్రంనాయుడు, జనార్ధనరావు పాల్గొన్నారు.

కీలకపాత్ర పోషించాలి



మండల కన్వీనర్లతో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

- ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: నియోజకవర్గ స్థాయిలోని అన్ని పార్టీ కార్యక్రమాల్లో జగనన్న సచివాలయ గృహసారథుల కన్వీనర్లు బాధ్యతగా కీలకపాత్ర పోషించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావుతో కలసి బుధవారం కన్వీనర్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శంబంగి మాట్లాడుతూ, రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీకి సంబంధించిన అన్ని కార్యకలాపాల్లోనూ కన్వీనర్లు ముఖ్య భూమిక పోషించాలన్నారు.

కన్వీనర్లు వీరే..

బొబ్బిలి పట్టణ జేసీఎస్ కన్వీనర్‌గా రేజేటి ఈశ్వరరావు (విసు).. మండల కన్వీనర్‌గా తమ్మిరెడ్డి దామోదరరావు.. బాడంగి మండలానికి మరిపి శంకరరావు.. తెర్లాం మండలానికి చేపేన సత్యనారాయణ.. రామభద్రపురం మండలానికి చింతల సింహాచలం నాయుడు కన్వీనర్లుగా వ్యవహరిస్తారు. వీరిని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నియోజకవర్గ పరిశీలకుడు కరిమి రాజేశ్వరరావు, యువ నాయకుడు శంబంగి శ్రీకాంత్ అభినందించారు.

కొలతల ప్రకారం పనులు

తెర్లాం: కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు 257 రూపాయల వేతనం గిట్టుబాటు అవుతుందని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని జగ్గారావు చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పనులకు హాజరైన వేతనదారుల మస్తర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వేతనదారులు రెండు పూటలా పనులకు హాజరైతే వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు. పని ప్రదేశంలో తప్పనిసరిగా తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

రికార్డుల నిర్వహణ తప్పనిసరి : కలెక్టర్



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

రాజాం సిటీ: సచివాలయాల్లో బీఎల్‌ఓల రికార్డు నిర్వహణ తప్పనిసరిగా అమలు చేయాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి అన్నారు. మండల పరిధిలోని గార్రాజుచీపురుపల్లి గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా ఆమె బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులన్నీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బీఎల్‌ఓ రికార్డు నిర్వహణతో పాటు సేవలు విస్తృతం చేసి పనితీరు మెరుగుపర్చుకోవాలని సిబ్బందికి సూచించారు. సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు యూనిఫాం ధరించాలని సూచించారు.

ప్రకృతిసేద్యంతో రైతులకు మేలు



పంటలు పరిశీలిస్తున్న ప్రకృతిసేద్య సిబ్బంది

బొబ్బిలి రూరల్: పెట్టుబడి లేని ప్రకృతిసేద్యంతో రైతులకు మేలు చేకూరుతుందని ప్రకృతి సేద్యం డివిజన్ కో ఆర్డినేటర్ వాండ్రాసి లక్ష్మి అన్నారు. మండలంలోని గొర్లెసీతారాంపురంలో పెట్టుబడిలేని ప్రకృతిసేద్యంపై లక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులు పండిస్తున్న కూరగాయ పంటలను పరిశీలించి, పలు సూచనలు చేశారు.

చెరకు కాటాను సద్వినియోగం చేసుకోండి

- జీసీసీ సత్యనారాయణ



కాటాపై బండి బరువు చూస్తున్న జీసీసీ సత్యనారాయణ

బొబ్బిలి రూరల్: చెరకు కాటాను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కేన్ కమిషనర్ (జీసీసీ) జీవీవీ సత్యనారాయణ కోరారు. మండలంలోని రంగరాయపురంలో ఏర్పాటు చేసిన చెరకు కాటాను బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏజీఎం అప్పారావు, సర్పంచ్ గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి



అప్పలంపేటలో భూముల సరిహద్దుల గుర్తింపును పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ

తెర్లాం: జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకంలో భాగంగా గ్రామాల్లో చేపడుతున్న భూముల రీసర్వేకు రైతులు పూర్తిస్థాయిలో సహకరించాలని మండల డిప్యూటీ తహసీల్దార్ గొంగాడ సత్యనారాయణ అన్నారు. మండలంలోని అప్పలంపేటలో జరుగుతున్న గ్రౌండ్ ట్రూథింగ్ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామంలోని భూముల సరిహద్దులను సచివాలయ సర్వేయర్లు గుర్తించినప్పుడు రైతులు దగ్గర ఉండి వారి పొలాలకు సంబంధించిన సరిహద్దులను తెలియజేయాలని కోరారు. రైతుల సమక్షంలో సరిహద్దుల గుర్తింపు చేపడితే భవిష్యత్‌లో భూములకు సంబంధించి రైతుల మధ్య ఎటువంటి సమస్యలు తలెత్తవని చెప్పారు. ఆయనతో పాటు వీఆర్‌ఓ రవి, సచివాలయ సర్వేయర్లు ఉన్నారు.

రేపటి నుంచి బాల అన్నమ్మ పేరంటాలు జాతర



ప్రత్యేక అలంకరణలో బాల అన్నమ్మ పేరంటాలు

సంతకవిటి: మండలంలోని సురవరం గ్రామంలో వెలసిన బాల అన్నమ్మ పేరంటాలు జాతర శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నట్లు పంచాయతీ సర్పంచ్ గంటా షణ్ముఖరావుతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం వెల్లడించారు. 44వ యాత్రా మహోత్సవాల్లో భాగంగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. జాతర ప్రారంభ కార్యక్రమంలో భాగంగా 108 గోవులకు ఆలయ ఆవరణలో శుక్రవారం గో పూజ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 20న పేరంటాలకు అభిషేకాలు, 21న ఘటాలు సమర్పణ, 22న అభిషేకాలతో పాటు ఆలయ ఆవరణలో ఉలవల బస్తాల, సంగిడీ పోటీలు నిర్వహణ, 23న జాతర ముగింపుతో పాటు కోలాటం, సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శన ఉంటుందని అన్నారు. ఈ నాలుగు రోజులు భారీ అన్న సంతర్పణలు, వినూత్న సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

రికవరీ సొమ్ము జమ చేయాలి

- విజిలెన్స్ జిల్లా అధికారి రవీంద్ర



మాట్లాడుతున్న ఉపాధి హామీ పథకం విజిలెన్స్ జిల్లా అధికారి రవీంద్ర

బొబ్బిలి రూరల్: మండలంలో సామాజిక తనిఖీలలో బకాయి పడిన సిబ్బంది వేగవంతంగా రికవరీ సొమ్ము జమ చేయాలని ఉపాధి హామీ పథకం విజిలెన్స్ జిల్లా అధికారి ఎస్. రవీంద్ర తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అధికారులు, సిబ్బంది ఎంతెంత బకాయి పడ్డారో వెల్లడించారు. అలాగే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. మండల నుంచి 2,51,273 రూపాయలు రికవరీ కావాల్సి ఉందన్నారు. సమావేశంలో ఎంపీడీఓ అల్లు భాస్కరరావు, ఏపీఓ జనార్దనరావు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల మండల కన్వీనర్లకు అభినందన



సచివాలయాల మండల కన్వీనర్లను అభినందిస్తున్న జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేలు

రాజాం: రాజాం పట్టణంతో పాటు నియోజకవర్గంలోని మండలాలకు వైఎస్సార్‌సీపీ సచివాలయ మండల కన్వీనర్లను కొత్తగా నియమించింది. బుధవారం వీరంతా రాజాంలో వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయం వద్ద జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును, ఎమ్మెల్యే కంబాల జోగులును కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు.

రాజాం పట్టణ వార్డు సచివాలయాల కన్వీనర్‌గా కామోదుల శ్రీనివాసరావు, రాజాం మండల గ్రామ సచివాలయాల కన్వీనర్‌గా కొయ్యాన సత్యన్నారాయణ, రేగిడి మండల గ్రామ సచివాలయాల కన్వీనర్‌గా పాలవలస రామచంద్రి నాయుడు, సంతకవిటి మండల గ్రామ సచివాలయాల కన్వీనర్‌గా రాగోలు రమేష్‌నాయుడు, వంగర మండల గ్రామ సచివాలయాల కన్వీనర్‌గా మరిశర్ల విజయలక్ష్మి నియామకం కాగా, వీరిని జెడ్పీ చైర్మన్‌తో పాటు ఎమ్మెల్యేలు అభినందించారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే ప్రజలకు మేలు

- ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు

రామభద్రపురం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రజలకు మేలు జరుగుతుందని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ, మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో నవరత్నాల ద్వారా ప్రవేశపెట్టిన పథకాలతో ఒక్కో కుటుంబానికి సుమారు రూ. లక్ష నుంచి రూ.5 లక్షల వరకు మేలు జరిగిందన్నారు. పేదలకు మేలు చేసే ఇలాంటి ప్రభుత్వం కలకాలం ఉండాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని చెప్పారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని తెలిపారు.

గృహసారథులను త్వరగా నియమించి వివరాలు తెలియజేయాలని మండల నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు, పాలసొసైటీ – 1 అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతల సింహాచలంనాయుడు, సీనియర్ నాయకులు డర్రు పైడిరాజు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీడీఓ రమామణి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రమామణి

రామభద్రపురం: సచివాలయాల్లో అందుబాటులోకి తీసుకువచ్చే ఆధార్ ప్రత్యేక కాంప్‌లను ప్రజలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రమామణి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ, ఆధార్ అప్‌డేట్ చేసుకోవడానికి ఈ నెల 19, 20, 21, 23, 24 తేదీల్లో ఆయా సచివాలయాలు, వాటి పరిధుల్లోని పాఠశాలల్లో ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహిస్తామన్నారు. 19న రామభద్రపురం ఉన్నత పాఠశాల, దుప్పలపూడి సచివాలయంలో.. 20న రామభద్రపురం చొక్కాపువీధి ప్రాథమిక పాఠశాల, ఆరికతోట ఉన్నత పాఠశాల.. 21న నాయుడువలస, పాతరేగ సచివాలయాలు.. 23న జన్నివలస, కోటశిర్లాం సచివాలయాలు.. 24న గొల్లపేట, కొండకెంగువ సచివాలయాలలో ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక మేజర్ పంచాయతీ ఈఓ సుప్రియ పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ మండల స్థాయి సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ ఉమాలక్ష్మి, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు

తెర్లాం: మండల కేంద్రంలోని రామకృష్ణ థియేటర్ ఆవరణలో గురువారం ఉదయం పది గంటలకు వైఎస్సార్‌సీపీ మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో వారు మాట్లాడుతూ, సమావేశానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు హాజరవుతారన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, నాయకులు హాజరుకావాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు పెనుమత్స అప్పలరాజు, విజయబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

బొబ్బిలి: ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో ఈ ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈనెల 19 నుంచి మూడు రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నట్లు బొబ్బిలి ఈఈ పూడి హరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 నుంచి 21 వరకూ స్థానిక ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేపడతామని పేర్కొన్నారు. ప్రతి రోజూ ఉదయం పదిన్నర నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.. తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందన్నారు.